సర్వీసు రోడ్డులో నిలిచిన ఆయిల్ లారీలు


ఐవోసీ నుంచి మల్కాపురం సర్వీసు రోడ్డు వరకు నిలిచిన ఆయిల్ లారీలు


టెర్మినల్ ప్లాంట్‌కు ఇతర వాహనాలు వెళ్లకుండా అడ్డంగా పెట్టిన ట్రాఫిక్ పోలీస్ ద్విచక్రవాహనం

- ఇబ్బంది పడ్డ పాదచారులు, వాహనదారులు
- సమస్య పరిష్కరించిన ట్రాఫిక్ ఎస్‌ఐ

మల్కాపురం: ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు ఒక్కసారిగా వందల సంఖ్యలో ఆయిల్ లారీలు రావడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది. టెర్మినల్ ప్లాంట్ నుంచి సర్వీసు రోడ్డు వరకూ లారీలు బారులు తీరడంతో ఆ మార్గంలో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది.దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు వచ్చి వాహనాలు క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఇదీ పరిస్థితి .. ఐవోసీకి లోడింగ్‌కు వచ్చే ఆయిల్ లారీలకు తగినంత పార్కింగ్ ప్రదేశం లేదు. దీంతో వాహనాలను మల్కాపురం నుంచి ఐవోసీకి వెళ్లే సర్వీసు రోడ్డుకు ఇరువైపులా లారీలు నిలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం ఐటీసీ టెర్మినల్ ప్లాంట్‌కు సెలవు కావడంతో లోడింగ్ జరగలేదు. దీంతో శుక్రవారం వచ్చిన ఆయిల్ లారీలు, శనివారం లోడింగ్ కోసం లారీలు ఒక్కసారిగా రావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. లారీలన్నీ ఐవోసీ నుంచి మల్కాపురం వైపు సర్వీసురోడ్డులో నిలపడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంది. ఆ సమయంలో అటు వైపు వచ్చే పాదచారులు,ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ సుదర్శనరావు సిబ్బందితో అక్కడకు వచ్చి ట్రాఫిక్ సమస్య లేకుండా అవసరమైన చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన జియ్యాని


జీవీఎంసీ కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయికాంత్ వర్మను ఆయన కార్యాలయంలో శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువ కప్పి జ్ఞాపిక అందించారు. విశాఖ అభివృద్ధికి తామంతా సహకారం అందిస్తామని తెలిపారు. నగరంలో పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

మహాపాదయాత్రకు పలు పార్టీల మద్దతు


మహా పాదయాత్రలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సమితి చేపట్టిన మహా పాదయాత్రకు పలు పార్టీల మద్దతు లభించింది. ఎన్‌ఏడీ జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. జియ్యాని శ్రీదర్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం వ్యవహరిస్తున్న తీరు చాలా దారుణమన్నారు. గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద సీఐటీయూ గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ, బలివాడ వెంకటరావు తదితరులు మద్దతుగా పాదయాత్రలో పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం మల్కాపురానికి చెందిన ఎస్.మహేష్ అనేదాత లక్ష 1016 రూపాయిలు విరాళం ఇచ్చారు. సింహగిరిపై మే ఐ హెల్ప్‌యు కేంద్రంలో దేవస్థానం తరపున దాతకు సూపరింటెండెంట్ పద్మనాభరాజు బాండ్ అందజేశారు.

వెంకన్నకు విశేష పూజలు


పూజలు అందుకున్న వెంకన్న స్వామి

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసు దేవరావు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా హనుమాన్ శోభా యాత్ర

మార్మోగిన జై హనుమాన్ నినాదం


కరాసా నుంచి బయలుదేరిన హనుమాన్ శోభా యాత్ర


ప్రత్యేక వేషధారణలో కళాకారులు

గోపాలపట్నం: కరాసా రోడ్డు జై హనుమాన్.. జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగి పోయింది. హనుమాన్ శోభా యాత్ర వైభవంగా ప్రారంభమైంది. బీజేపీ, విశ్వహిందూ పరిషత్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శోభా యాత్రను శనివారం కరాసా పెట్రోల్ బంక్ వద్ద బీజేపీ నాయకులు ప్రారంభించారు. జై శ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో బీఆర్‌టీఎస్ సర్వీస్ రహదారిలో బయలు దేరారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

కరాసా బంక్ సెంటర్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇక్కడి నుంచి బైకులపై ర్యాలీ నిర్వహించారు. అధిక సంఖ్యలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. హనుమంతుని వేష ధారణల్లో కళాకారులు అలరించారు. వారితో చాలా మంది ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

ఆరు తులాల బంగారు ఆభరణాల అపహరణ

మల్కాపురం: గాలి కోసం తలుపులు తీసి పడుకున్న ఆ ఇంట్లో ఆరు తులాల బంగారం ఆభరణాలు మాయం అయ్యాయి. ఈ చోరీకి సంబంధించి క్రైం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని శివరామకృష్ణ ఆలయం వద్ద డి.శ్రీనివాస్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. గాలి సరిగ్గా రాకపోవడంతో శుక్రవారం రాత్రి తలుపులు తీసి భార్య,పిల్లలతో వరండా వద్ద పడుకున్నారు. ఇదే అదునుగా గుర్తు తెలియని దొంగ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను దాచిన ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరించాడు. తెల్లవారి లేచి చూసే సరికి బీరువా తలుపుతు తెరిచి ఉండడంతో శ్రీనివాస్ పోలీసులకు జరిగిన దొంగతనంపై ఫిర్యాదు ఇచ్చాడు. వారు క్లూస్ టీమ్‌తో అక్కడకు వచ్చి పరిశీలించారు.

వెళ్లొస్తా..

గోపాలపట్నం: విశాఖ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ శనివారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఉదయం 9.20 గంటలకు ఎయిర్ ఏసియా విమానంలో తిరుగు ప్రయాణమయ్యాడు. విశాఖ విమానాశ్రయంలో అభిమానులు ఆయన్ను సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు. అభిమానులకు అభివాదం చేస్తూ లోపలికి వెళ్లాడు.

జాబ్‌మేళాకు విశేష స్పందన


మాట్లాడుతున్న ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సీహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ముత్తూట్ ఫిన్ కార్పో లిమిటెడ్, స్మార్ట్ సర్వీసెస్, కెలిబర్ సపోర్ట్ సర్వీసెస్, మహవీర్ గ్రూప్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 263 ఉద్యోగాలకు గాను 46 మంది అర్హత పొందారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హత పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


నిహారిక

మత్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ వద్ద తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న యువతి కోనాడ నిహారిక శుక్రవారం అర్ధరాత్రి దాటాక కనిపించలేదు. వేసవి సెలవుల నేపథ్యంలో తండ్రి నరసింహమూర్తి తన కుమార్తెను జ్ఞానాపురంలో ఉంటున్న బంధువుల ఇంటికి పంపించారు. శుక్రవారం బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లిన నిహారిక అర్ధరాత్రి 12 గంటలు అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో శనివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ బి.ఎస్.మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

చిత్ర సీమలో కోదండపాణికి ప్రత్యేక స్థానం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ రామచంద్రన్

దాబాగార్డెన్స్: తెలుగు చలనచిత్రసీమలో ఎస్పీ కోదండపాణికి ప్రత్యేక స్థానం ఉండదని విశాఖ పోర్టు చైర్మన్ టీకే రామచంద్రన్ పేర్కొన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి 49వ వర్ధంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం కళాంజలి సినీ సంగీత సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కె. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మనసా కవ్వించకే నన్నిలా పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరిని పోర్టు చైర్మన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.కోదండపాణి అతి తక్కువ కాలంలో 101 చిత్రాలకు చక్కని బాణీలు కట్టారని చెప్పారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పాటకు, సాహిత్యానికి గౌరవం పెంచేలా సంగీతాన్ని అందించిన మహనీయుడు కోదండపాణి అని కొనియాడారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, చార్టర్డ్ అకౌంటెంట్ రాంజీ, మాజీ ఏడీసీపీ మహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

హృదయాలను హత్తుకున్న నాటకాలు


కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: మూడో ప్రపంచ యుద్ధ భయంతో క్షణక్షణం నరకయాతన పడుతూ బతుకీడుస్తున్న కాలంలో సరిహద్దు జీవన గాథే కథాంశంగా ప్రదర్శించిన కొత్త పరిమళం నాటకం, తల్లిదండ్రుల పేగు బంధంపై ప్రదర్శించిన మనసున మనసై నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఐదో రోజు ప్రదర్శించిన రెండు నాటకాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఈ పోటీలను కస్టమ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెఎస్ ఎస్ రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

తొలి ప్రదర్శన: 'కొత్త పరిమళం'

శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు కొత్త పరిమళం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో రగిలిన విద్వేశాలను కళ్లకు కట్టినట్టుగా చూపారు. మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోయి జాతి, మతం విద్వేషాలతో దేశాలు రగిలిపోతున్న క్షణాలు.. కన్నీళ్లు పెట్టేలా నటీనటుల ప్రతిభకు పట్టం కట్టారు. జాతి, మతద్వేషాలను అంతం చేసే మానవత్వ విశ్వరూప సౌందర్యం అనే కొత్త పరిమళంతో హద్దులు, నరిహద్దులు లేని ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన ఈ నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. కె.కె.స్వామి నాటకాన్ని రచించగా.. బి.ఎం.ఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించారు.

రెండో ప్రదర్శన: 'మనసున మనసై'

ఏలూరుకు చెందిన హేళాపురి కల్చరల్ అసోసియేషన్ వారిచే మనసున మనసై నాటకం ప్రదర్శించారు. చిన్నతనంలో బడికి వెళ్లిన బిడ్డ తిరిగి ఇంటికొచ్చే వరకూ ఎదురుచూసే తల్లిదండ్రులు, పెరిగి పెద్దవాడయ్యాక సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ తలకొరివి పెట్టడానికి రోజుల తరబడి మార్చురీ బాక్స్‌లో పెట్టి ఎదురుచూసే పరిస్థితుల ఇతివృత్తంగా ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకుల మనసును కదిలించింది.

30న 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు

దాబాగార్డెన్స్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'మే డే'సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రతినిధి జీఎస్ రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం ప్రతినిధి దండు నాగేశ్వరరావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలకు శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, ఏకపాత్రాభినయాలు, ఫ్లూట్ తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రీ, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 25 లోపల తమ ఎంట్రీలను 9490750661, 9490098794 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చని తెలిపారు.

అభాగ్యులకు ఆశ్రయం

అల్లిపురం: కేజీహెచ్‌లో నలుగురు అభాగ్యులను ఎవరో తీసుకువచ్చి చేర్పించారు. వారికి వైద్యం పూర్తయినా వెళ్లలేని పరిస్థితిలో ఉండగా ఆస్పత్రి సిబ్బంది మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు విషయం తెలియజేశారు. దీంతో ఆమె శనివారం వారిని ఆస్పత్రి సూపరింటెండెంట్ సహకారంతో పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించి ఆశ్రయం కల్పించారు.

ఘనంగా ఘంటసాల శత జయంతి


జ్ఞాపికలతో గాయకులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి వేడుకలు శనివారం గోపాలపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు ఘంటశాల పాటలు ఆలపించారు. కళాపీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు మాట్లాడుతూ ఘంటశాల సినీ సంగీత ప్రపంచానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సుమారు 4వేలకు పైగా పాటలు పాడి తెలుగు శ్రోతల గుండెల్లో నిలిచి పోయారన్నారు. ఈ సందర్భంగా పాటలు పాడిన కళాకారులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, జి. అప్పారావు, శ్రీనివాస్,వెంకట్, టి. రామరావు, కనకరాజు, నూక రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- విలవిల్లాడుతున్న చిరు వ్యాపారులు


మల్కాపురం వద్ద నీడ జాడలేని చోట అరటిపండ్లు అమ్ముతున్న వృద్ధురాలు


జింక్ సర్వీసు రోడ్డులో ఎండలోనే కూరగాయల విక్రయం

మల్కాపురం: భానుడు భగభగ మంటున్నాడు. సూర్య ప్రతాపానికి చిరు వ్యాపారులు విలవిల్లాడుతున్నారు. బతుకు పోరాటంలో మండుటెండలో వృద్ధులు సైతం వ్యాపారం చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచే మండే ఎండతో పాటు వేడి గాల్పులు రావడంతో జనాలు పెద్దగా బయట తిరగలేదు. అయినా మల్కాపురం ప్రాంతంలో 65 ఏళ్ల వృద్ధురాలు ఎవరైనా వస్తారు.. అరటి పండ్లు కొంటారని ఎండలోనే నిరీక్షించింది. అలాగే జింక్ సర్వీసు రోడ్డులో చిరు వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు అమ్మకాలు సాగిస్తున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక ఎవరూ రాలేదు. ఇక్కడ వ్యాపారం చేస్తున్న ఓ వృద్ధురాలు ఎండ తీవ్రతకు సొమ్మసిల్లింది. దీంతో తోటి వ్యాపారులు సపర్యలు చేసి నీడ పట్టున ఉంచారు. అధికారులు తమ బాధలను గుర్తించి రోడ్డుపై వ్యాపారాలు సాగించే వారికి హాకర్స్ జోన్ వంటి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

ప్రైవేటీకరణ ఆగే వరకు ఉద్యమం


దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగే వరకు కార్మికుల ఉద్యమాలు ఆగవని పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉన్న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే దీక్షల్లో 793వ రోజు శనివారం సంస్థకు చెందిన ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

ఉత్సాహంగా 'మానమ్మకం నువ్వే జగన్'


మహిళలకు కరపత్రాలు అందిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు పాలనపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పారిశ్రామిక ప్రాంతంలో ఉత్సాహంగా సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పాలన బాగుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రజల సమ్మతితో ఇంటి గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వరపల మహేష్, గుండపు అశోక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలిపే కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నక్కా సూర్యనారాయణ, భీశెట్టి గణేష్, భారతి, కమల ఇతర నాయకులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో నాయకులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటిని సందర్శించి గత ప్రభుత్వ కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.. కార్యక్రమంలో సూరాడ పెంటారావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు


విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే స్వామికి జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు తులసి మాలలు సమర్పించుకున్నారు. ఆలయ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో విశేష అర్చనలు, సహస్ర నామాభిషేకాలు నిర్వహించారు.

1న వార్షిక తిరు కల్యాణోత్సవం..

వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీన కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఏవో జీవీ రమాబాయి తెలిపారు. 1వ తేదీన ధ్వజారోహణం, ఏకాదశిని పురస్కరించుకుని సాయంత్రం 7 గంటల నుండి దేవస్థానం కల్యాణ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు వివరించారు. 5వ తేదీన చక్రతీర్థం, ధ్వజావరోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్రహారతి, సప్తహారతి కార్యక్రమాలు, 6వ తేదీన ఊంజల సేవ, పుష్పాలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎస్టీ సెల్ ప్రక్షాళన హర్షణీయం

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఎస్టీ సెల్‌ను ప్రక్షాళన చేయడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయమై సాక్షి దిన పత్రికలో ఈనెల 12న 'కేజీహెచ్ ఎస్‌టీ సెల్ ప్రక్షాళన'శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి విదితమే. అవినీతి, నిర్లక్ష్యం వంటి ఆరోపణలు వెల్లువెత్తిన ఈ విభాగం గిరిజనులకు సరైన సేవలందించలేకపోయిందని అన్నారు. ఈ తరుణంలో ఇక్కడి సిబ్బందిని బదిలీ చేసి కొత్త వారిని నియమించడం మంచి పరిణామమన్నారు. బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు అమలు చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.